సాక్షి
నిజామాబాద్
సోమవారం, 26, ఫిబ్రవరి, 2024



గుడిసె.. వెలిసె..

బాల్కొండలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కబ్జాదారులు యత్నిస్తున్నారు. సర్వే నంబర్ 1333లో గుడిసెలు వేస్తున్నారు.

- 8లో ▸



విద్యుత్‌శాఖలో వింత ధోరణి

విద్యుత్‌శాఖలో చిన్న తప్పిదాలకే ఉద్యోగులను శిక్షిస్తున్న అధికారులు.. ఉద్యోగాల పేరిట మోసం చేసిన ఏఈపై చర్యలు తీసుకోవడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /23.4

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు ఆర్వోబీ పనులకు ప్రధాని శంకుస్థాపన

బోధన్‌టౌన్(బోధన్): అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా బోధన్‌లోని గాంధీ పార్కు రైల్వే స్టేషన్ ఆవరణలో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరు కానున్నారని రైల్వేశాఖ అధికారులు తెలిపారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నర్సుల తొలగింపు

నిజామాబాద్ నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నర్సులను తొలగించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించిన తమను రాత్రికి రాత్రే ఉద్యోగం నుంచి తొలగించారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఇటీవల ప్రభుత్వం తొలగించింది. రెగ్యులర్ స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్లు రావడంతో వీరిని తొలగించినట్లు చెబుతున్నారు. నగరంలోని జీజీహెచ్‌లో 9 మంది కాంట్రాక్ట్, ఎనిమిది మంది ఔట్ సోర్సింగ్ నర్సులను తొలగించారు. దీంతో కాంట్రాక్ట్ నర్సులు హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి ఉద్యోగాలు నిర్వహించామని, తమ ఉద్యోగాలు తమకు ఇప్పించాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అందరిని యథావిధిగా కొనసాగించాలన్నారు.

కాకతీయ కాలువ ద్వారా పెరిగిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను పెంచారు. కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 400 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిఫ్ట్ ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 447 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1071.5 అడుగుల(32.2 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. గతేడాది ఇదే రోజు 1078.10 అడుగుల(47.45టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

డిచ్‌పల్లి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్ర నాయక్ సూచించారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రానికి వెళ్తూ మార్గమధ్యలో డిచ్‌పల్లిలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి(సీహెచ్‌సీ)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోజు ఎంత మందికి ఓపీ, ఐపీ పేషెంట్లకు సేవలందిస్తున్నారని మెడికల్ ఆఫీసర్ రాజశ్రీని అడిగి తెలుసుకున్నారు. ఎంత మందికి ప్రసవాలు చేస్తున్నారని అడిగారు. మనం నాణ్యమైన వైద్య సేవలందిస్తే ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు వస్తారని పేర్కొన్నారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు సుశాంత్, సందీప్ రెడ్డి, డీఈవో గోపి, స్టాఫ్‌నర్స్ ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- అక్రమాలకు పాల్పడడంతో విచారణ చేసి సస్పెండ్ చేసిన ట్రస్ట్

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడిలో గల అమృతలక్ష్మి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో అందిస్తున్న ఆరోగ్యశ్రీ సేవలపై ఇటీవల ట్రస్ట్ ప్రతినిధులు విచారణ చేపట్టారు. విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దీంతో ట్రస్ట్ అధికారులు ఆరోగ్యశ్రీ సేవల నుంచి ఆస్పత్రిని సస్పెండ్ చేశారు. ఇక నుంచి ఈ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉండవని ప్రకటించారు. నగరంలోని మరో రెండు, మూడు ప్రముఖ ఆస్పత్రుల్లో సైతం ఆరోగ్యశ్రీ సేవల పేరిట అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. వాటిపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.



పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కుస్తీమే సవాల్

ఎడపల్లి మండలం జాన్కంపేట శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన కుస్తీపోటీలు ఆకట్టుకున్నాయి. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కుస్తీ పట్టడానికి మల్లయోధులు వచ్చారు. విజేతలకు రూ. 100 నుంచి రూ. 2000 వరకు నగదు ప్రోత్సాహం అందించారు. కుస్తీ పోటీలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ముగిసిన ఖిల్లా రామాలయ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో వారం రోజులుగా జరుగుతున్న సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నాగవెళ్లి, ద్వాదశ ఆరాధన, పుష్పయాగం, ఉద్వాసన బలి, భూతబలి, నివేదన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పండితులు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, తాజా మాజీ సర్పంచ్ గడ్డం రాధకృష్ణారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, వీడీసీ సభ్యులు తోట చిన్నసాయిలు, వారాల సాయిలు, ఆలయ కమిటీ డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూరమాధురి, ఆసది జితేందర్ పాల్గొన్నారు.

బిందు సేద్యానికి బ్రేక్!

- ప్రభుత్వం మారడంతో నిలిచిన ప్రక్రియ
- డీడీలు కట్టిన రైతులకు మంజూరుకాని యూనిట్లు
- కొత్త ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్న అధికారులు
- అయోమయంలో పండ్ల తోటల సాగు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు అశోక్. వర్ని మండలం తగ్లేపల్లి. పండ్ల తోట సాగుకు ముందుకు వచ్చి రెండున్నర ఎకరాల్లో మామిడి తోట వేశాడు. బిందు సేద్యం కోసం డీడీ కూడా చెల్లించాడు. మొక్కలు నాటి ఆరు నెలలు అవుతున్నా ఇంత వరకు డ్రిప్ పరికరాలు రాలేదు. మొక్కలు ఎండిపోకూడదని వారానికోసారి కూలీలను పెట్టి బిందెలతో నీటిని పోయిస్తూ కాపాడుతున్నాడు. డ్రిప్పు ఎప్పుడిస్తారని సంబంధిత అధికారులను అడిగినా వారు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇలా ఒక్క అశోక్ ఒక్కడే కాదు.. జిల్లాలో పండ్ల తోటల సాగుకు ముందుకొచ్చిన రైతులు అవస్థలు పడుతున్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో యుద్ధ ప్రతిపాదికన చేపట్టిన పండ్ల తోటల పెంపకం అయోమయంలో పడింది. ప్రభుత్వం మారడంతో ఉద్యాన పంటలు వేసిన రైతులకు బిందుసేద్యం యూనిట్లు మంజూరు కాకుండా నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో సంబంధిత అధికారులు రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. దీంతో కొత్తగా పండ్ల తోటలను సాగు చేయడానికి ఇతర రైతులు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వం ఉద్యాన, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంయుక్తంగా జిల్లాకు 986 ఎకరాల్లో ఉద్యాన తోటలు సాగు చేయించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. రైతులను పండ్ల తోటల వైపు మళ్లించడానికి మొక్కలతో పాటు బిందు సేద్యం యూనిట్లను రాయితీపై అందించాలని నిర్ణయించింది. ఇరు శాఖల అధికారులు రైతులను చైతన్యపరిచి జిల్లాలో 150 ఎకరాల్లో సాగు చేయించడానికి మొత్తం 104 మంది రైతులను గుర్తించారు. ఉపాధిహామీ పథకం ద్వారా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లిన అధికారులు కొంత రైతులకు పండ్ల మొక్కలను కూడా అందజేశారు. మొక్కలను తమ వ్యవసాయ భూముల్లో నాటుకున్న రైతులు ప్రస్తుతం బిందు సేద్యం యూనిట్ల కోసం నిరీక్షిస్తున్నారు. అయితే, జిల్లాలో ఉద్యాన తోటల సాగును పెంచడానికి రైతులు ముందుకు వచ్చినప్పటికీ డ్రిప్ పరికరాలు అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, ఇతర రైతులకు 90శాతం సబ్సిడీ అందజేస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుత ప్రభుత్వం దీనిని అమలు చేస్తుందో లేదో వేచి చూడాలి.



వర్ని మండలం తగ్లేపల్లిలో డ్రిప్పు లేకుండానే సాగవుతున్న మామిడి తోట

జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం

తోట	ఎకరాలు	తోట	ఎకరాలు
		సీతాఫలం	36
మామిడి	500	నిమ్మ	20
మునగ	100	సపోట	10
జామ	100	డ్రాగన్ ఫ్రూట్	10
కొబ్బరి	200	దానిమ్మ	10

తొమ్మిది రకాల పండ్ల తోటలు

ఉపాధిహామీ పథకం ద్వారా తొమ్మిది రకాల పండ్ల తోటలు సాగు చేయడానికి ఉద్యాన, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రణాళికలు రూపొందించాయి. మామిడి, మునగ, జామ, కొబ్బరి, సీతాఫలం, నిమ్మ, సపోట, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ తోటల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఎంపిక చేసిన రైతుల్లో కొంతమందికి నర్సరీల నుంచి ఉచితంగానే పండ్ల మొక్కలను అందజేశారు. డ్రిప్ పరికరాలకు కూడా ప్రభుత్వం పూర్తి సబ్సిడీ ఇవ్వనుండడంతో కొంతమంది రైతులు డీడీలు చెల్లించారు. ఏడాదవుతున్నా ఇంత వరకు డ్రిప్ యూనిట్లు రాకపోవడంతో పండ్ల తోటల సాగుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కలు ఎండిపోకుండా బోర్ల సాయంతో తోటలకు నీరందిస్తున్నారు. కూలీలను పెట్టి బిందెల ద్వారా నీటిని పోయిస్తూ తోటలను కాపాడుతున్నారు. అయితే బిందు సేద్యం యూనిట్లు మంజూరు కావడం లేదని తెలుసుకున్న ఎంపికైన కొంతమంది రైతులు పండ్ల మొక్కలను తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు 104 మంది రైతుల్లో ఒక్కరికి కూడా డ్రిప్ పరికరాలు అందలేవు.

హైరిస్క్ వే..!

- 44వ నంబర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- యాక్సిడెంట్ల నివారణకు 12 బ్లాక్ స్పాట్ల గుర్తింపు
- 71 కిలోమీటర్ల మేర పరిశీలించిన అధికారులు

ఖలీల్‌వాడి: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా 44వ జాతీయ రహదారిపై పలు సంఘటనల్లో పలువురి ప్రాణాలు గాలిలో కలు స్తున్నాయి. మరికొందరు క్షతగాత్రులు ఆస్పత్రుల పాలవుతున్నారు. దీంతో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను పోలీసులు, నేషనల్ హైవే అధికారులు గుర్తించారు.

దగ్గి టు చాకిర్యాల్ చౌరస్తా

జిల్లాలోని ఇందల్వాయి మండలం దగ్గి నుంచి మెండోరా మండలం చాకిర్యాల చౌరస్తా వరకు 44వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. జిల్లాలో 71 కిలోమీటర్ల పొడవునా హైవే ఉంది. హైవే మీదుగా వాహనాలు మహారాష్ట్ర, జగ్‌దల్‌పూర్‌తో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాయి.

గతేడాది 287 ప్రమాదాలు

జాతీయ రహదారి నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 287 రోడ్డు ప్రమాదాలు కాగా ఇందులో 309 మంది మృతి చెందారు. దీంతో ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించారు. హైవేపై 12బ్లాక్ స్పాట్‌లను సీపీ కల్మేశ్వర్, పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్, ఎన్‌హెచ్ అధికారు లు గుర్తించారు. బ్లాక్‌స్పాట్స్ వద్ద జరిగిన ప్రమాదాల వివరాలను స్థానిక పోలీసులతో పాటు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సీపీ సంబంధిత అధికారులకు వివరించారు.



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న సీపీ, ఎన్‌హెచ్ అధికారులు(ఫైల్)

ప్రమాదాలకు కారణాలివే..

ప్రమాదాలకు ఎక్కువగా అతివేగం, డ్రంకన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, గ్రామాల వద్ద మలుపులు ఎక్కువగా కారణమవుతున్నాయి. బైక్‌లు, ఆటోలు, కార్లు హైవే పక్కన ఉన్న గ్రామాల్లోకి వెళ్లేందుకు టర్న్ అయ్యే సమయంలో వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే గ్రామాలకు వెళ్లేందుకు యూటర్న్‌లు దూరంగా ఉండడంతో వ్యతిరేక దిశలో ప్రయాణించడం వల్ల యాక్సిడెంట్లు సంభవిస్తున్నారు. అలాగే రాత్రివేళలో సరైన వెలుతురు లేకపోవడం, రోడ్ల పక్కన హోటళ్లు ఉండడం వాహనాలు నిలిపివేయడం వల్ల కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.


నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీపీ కల్మేశ్వర్ ఎన్‌హెచ్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారులకు సూచనలు చేశారు. అవసరమైన చోట్ల యూటర్న్‌లను మూసివేయాలని పేర్కొన్నారు. అనుమతిలేని దాబాలు, వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుర్తించిన ప్రదేశాల్లో సర్వీసు రోడ్లు నిర్మించాలని సూచించారు. అలాగే ప్రమాదాలకు ఆస్కారం ఉన్న చోట్ల వాహనాల వేగం తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాల ని పేర్కొన్నారు. వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నే నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాలు హైవే రోడ్డుపైకి వచ్చేటప్పుడు తక్కువ వేగంతో ఎంట్రీ కావాలని సూచనలు చేశారు.

జలసమాధి

- రెండు రోజుల్లో ముగ్గురు పిల్లల మృత్యువాత
- కన్నవారికి కడుపుకోత

కాలకృత్యాలు తీర్చుకోవడానికో.. ఈత కోసమో.. చేపల వేటకోసమో చెరువుల వద్దకు వెళ్తున్న పిల్లలు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈత రాక కొందరు నీట మునిగి చనిపోతున్నారు. ఇలాంటి ఘటనలు ఏటా పదుల సంఖ్యలో వెలుగు చూస్తున్నాయి. తాజాగా రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు పిల్లలు జల సమాధి అవడం ఆందోళన కలిగిస్తోంది.



మహేశ్ కోసం గాలిస్తున్న జాలర్లు

సాక్షి, కామారెడ్డి : చాలా గ్రామాల్లో చెరువులు, కుంటలు గ్రామానికి సమీపంలో ఉంటాయి. చిన్నచిన్న పిల్లలు సైతం కాలకృత్యాల కోసం చెరువుల దగ్గరకు వెళ్తుంటారు. ఇలా వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి చనిపోతున్నారు. ఇంకొన్ని చోట్ల ఈత కోసం వెళ్లి, లోతు తెలియక, బురదలో కూరుకుపోయి మృత్యువాతపడుతున్నారు. నిజాంసాగర్ కెనాల్ ఉన్న ఏరియాలో పిల్లలు కాలువల్లోకి దిగి ప్రమాదవశాత్తూ చనిపోతున్నారు. బాన్సువాడ మండలంలో ఇటీవల ఒక బాలుడు నీటికాలువలో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. శనివారం గాంధారి మండలం ముదెల్లి గ్రామంలో శశాంక్ (9), రవీందర్ (9) లు చెరువు దగ్గరకు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి చనిపోయారు. ఈ సంఘటన మరచిపోకముందే అదే రోజు ఎల్లారెడ్డి మండలంలోని మౌలాన్‌ఖేడ్ గ్రామానికి చెందిన మహేశ్ (15) చేపలు పట్టే ప్రయత్నంలో నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం వరకు కూడా మృతదేహం లభించలేదు. ఏటా జిల్లాలో పదుల సంఖ్యలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

పిల్లలను గమనించాలి..

గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు పిల్లల్ని పాఠశాలకు పంపించి పొలం పనులకు వెళ్తుంటారు. అయితే స్కూల్ నుంచి ఇంటికి చేరుకున్న తర్వాత వారిని పట్టించుకునే వారుండరు. కొందరు పిల్లలు స్నేహితులతో కలిసి చెరువులు, కాలువల వెంట పరుగులు తీస్తుంటారు. ముఖ్యంగా కాలకృత్యాల కోసం వెళ్లినపుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. పిల్లలు స్కూల్ నుంచి వచ్చే సమయానికి తల్లిదండ్రులు గానీ, కుటుంబ సభ్యులు గానీ ఎవరో ఒకరు ఇంటి వద్ద ఉండి వారిని చూసుకుంటే ప్రమాదాలు జరగకుండా కాపాడుకోవచ్చు.

నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో బాలుడి గల్లంతు



మహేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: పొలం పనులు ముగించుకుని, నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన బాలుడు.. నీటిలో గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. మౌలాన్‌ఖేడ్ గ్రామానికి చెందిన లైన్ మహేశ్(15) శనివారం పొలంలో పురుగుల మందు పిచికారి చేశాడు. అనంతరం సాయంత్రం వేళలో నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో కాళ్లు, చేతులు కడుక్కున్న తర్వాత చేపలను పట్టేందుకు బ్యాక్ వాటర్‌లోకి దిగాడు. నీటిలోని పెద్ద గుంతలో పడి మునుగుతుండగా చుట్టుపక్కలనున్నవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. జాలరులు వచ్చి గాలించినా మహేశ్ ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం సాయంత్రం వరకు జాడ దొరకలేదు. మహేశ్ కోసం అతడి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

ఆశాజనకంగా పసుపు ధర

- 14 ఏళ్ల తర్వాత ఆశించిన ధర
- సాగు విస్తీర్ణం, దిగుబడి తగ్గడంతో పంటకు డిమాండ్

మోర్తాడ్: పసుపు పంటకు నిజామాబాద్ మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉంది. పద్నాలుగేళ్ల తర్వాత పసుపు పంటకు ఆశించిన ధర వస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు విస్తీర్ణం తగ్గడం, వర్షాలు ఎక్కువగా పడి దిగుబడి తగ్గడంతో పంటకు డిమాండ్ పెరిగి మంచి ధర పలుకుతోందని అన్నదాతలు చెబుతున్నారు. తాజాగా నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు క్వింటాలుకు రూ.13,500ల వరకు ధర పలుకుతోంది. సాంగ్లీ మార్కెట్‌లో కొంత ధర ఎక్కువగానే ఉన్నా అక్కడికి తరలించేంత పంట స్థానికంగా లేకపోవడంతో ఈ సారి రైతులు నిజామాబాద్ మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్నారు. నిజామాబాద్ మార్కెట్‌కు రోజుకు ఐదు వేల క్వింటాళ్ల నుంచి 8 వేల క్వింటాళ్ల వరకు పసుపు వస్తోంది. మార్కెట్ ఆరంభమైన నుంచి రూ.10వేల ధర మొదలుకొని రూ.13,500 వరకు పలుకుతోంది. పసుపు ధర నిర్ణయం కమోడిటీపై ఆధారపడి ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో హెచ్చుతగ్గుల ఆధారంగానే ధర పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. పసుపు పంటకు కనీస మద్దతు ధరను నిర్ణయించాలని రైతులు ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చొరవ చూపలేదు.



నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చిన పసుపు

పడిపోయిన దిగుబడి

గతంలో పసుపు పంటకు మంచి ధర లభించేది. 2010లో ఇందూర్ మార్కెట్‌తో పాటు, సాంగ్లీ మార్కెట్‌లో పంటకు రూ.15వేల నుంచి రూ.16వేల వరకు ధర లభించింది. ఆ తర్వాత ఒక్కో ఏడాది పడిపోతూ వచ్చింది. 2017లో రూ.10వేల వరకు ధర పలికింది. కరోనా విపత్కర పరిస్థితుల్లో పసుపు వినియోగం పెరగడం, విదేశాలకు ఎగుమతులు జరిగినా రూ.6వేలకు మించి ధర లభించలేదు. కొన్ని సందర్భాల్లో క్వింటాలుకు రూ.3వేల వరకు ధర పడిపోయింది. 2023 ఆగస్టులో మాత్రం నిల్వ చేసిన పంటకు రూ.10వేల నుంచి రూ.11వేల వరకు పలికింది. అప్పటి నుంచి ధర క్రమ క్రమంగా పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది అనేక మంది రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో ఎకరానికి 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో మార్కెట్‌లో పసుపు పంటకు కొరత ఏర్పడిందని తెలుస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసుపునకు డిమాండ్ ఉండటం, పంట కొరతతో ధర పెరిగిందని రైతులు అంటున్నారు. ఇందులో ఏ ప్రభుత్వం చొరవ చూపింది ఏమి లేదని పెదవి విరుస్తున్నారు.

పాత పసుపునకు గిరాకీ

- క్వింటాలుకు రూ.20 వేలు పలుకుతున్న ధర

బాల్కొండ: మార్కెట్‌లో పాత పసుపునకు ప్రస్తుతం డిమాండ్ ఉంది. గతేడాది విత్తనంగా వినియోగించిన పసుపునకు కూడా గిరాకీ ఉన్నట్లు కూలీలు చెబుతున్నారు. పసుపు విత్తన కొమ్ములు ప్రస్తుతం తవ్వకాల్లో బయట పడుతున్నాయి. వాటిని కూలీలు వేరు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.19 వేల నుంచి రూ.20 వేలు ధర పలుకుతుందని కూలీలు తెలుపుతున్నారు. ఎకరం భూమి దుక్కిలో క్వింటాలు పాత పసుపు వస్తుంది. ఈ ఏడాది పసుపు తవ్వకాల కోసం మహారాష్ట్ర నుంచి కూలీలు వలస వచ్చారు. మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌లో పాత విత్తన పసుపునకు డిమాండ్ ఉందని వారు చెబుతున్నారు. పసుపు తవ్వుతున్న సమయంలోనే పాత పసుపును కుప్పలు వేస్తున్నారు. పాత పసుపును కూడా ఉడికించి విక్రయిస్తామని వారు తెలిపారు.

మార్కెట్‌లో డిమాండ్



పసుపు పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. అలాగే సాగు విస్తీర్ణం తగ్గి, దిగుబడి లేకపోవడంతో పంటకు కొరత ఉంది. ఈ కారణంతో పసుపు ధర పెరిగింది తప్ప ఏ ప్రభుత్వం కారణం కాదు. పసుపు బోర్డు ఏర్పాటు అయి ఉంటే ధర పెరగడానికి అవకాశం ఉండేది. – సంజీవరెడ్డి, రైతు నాయకుడు, దొన్కల్

ధర ఉన్నా దిగుబడి లేదు



పసుపు పంటకు ధర ఉన్నా దిగుబడి లేకపోవడంతో రైతులకు పెద్దగా ప్రయోజనం లేదు. అనేక మంది రైతుల పొలాల్లో దిగుబడి 50 శాతానికి పైగా పడిపోయింది. పసుపు బోర్డును ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందిస్తే వచ్చే సీజనులో సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశం ఉంది. – కుంట రవిశంకర్‌రెడ్డి, రైతు, పాలెం

క్లుప్తంగా

కిడ్స్‌కేర్ పిల్లల ఆస్పత్రి ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని సరస్వతీనగర్‌లో కిడ్స్ కేర్ ఎమర్జెన్సీ పిల్లల ఆస్పత్రిని ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చిన్నపిల్లలకు అధునాతన వైద్యసదుపాయాలతో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నిర్మించిన అతిపెద్ద ఆస్పత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అందరి మన్ననలు పొందేలా వైద్య సేవలు అందించాలని, సేవా కార్యక్రమాల్లో సైతం ముందుండాలని నిర్వాహకులకు సూచించారు. డాక్టర్లు రమేశ్, అనిత రమేశ్‌పవార్, యూపీ ఐఏఎస్ రవీంద్రనాయక్, డ్బార్ రాజ్వేర్, సంగీత, కె రాధ, రాజేందర్ నాయక్, ఐఎంఏ ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఉచిత హామీలతో మోసం



నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ ఉచిత హామీలతో ప్రజలను మోసం చేస్తోందని, ఆ కోవలోనే రాష్ట్రంలో గద్దెనెక్కిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో కొమురం భీం క్లస్టర్‌లో కొనసాగుతున్న విజయ సంకల్పయాత్రా ఆదివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలానికి చేరుకోగా, ధన్‌పాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లు దోచుకొని తెలంగాణను ఆగం చేస్తే, ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 17 స్థానాలను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడిన రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు

రాజంపేట: రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు హాజీనాయక్ పలువురితోకలిసి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మదన్‌మోహన్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యుత్‌శాఖలో వింత ధోరణి

- ఆరోపణల నేపథ్యంలో జేఎల్‌ఎంల సస్పెండ్
- నిర్లక్ష్యంగా వ్యవహరించారని లైన్‌మెన్‌లపై వేటు
- రాతపూర్వకంగా ఫిర్యాదు అందినా ఏఈపై చర్యలు కరువు
- ముడుపులు నోళ్లు మూయించాయా?



నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖ అధికారులు వింత ధోరణని అవలంభిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు, ఆరోపణలు వస్తే వెంటనే కిందిస్థాయి సిబ్బందిపై వేటువేస్తున్న ఉన్నతాధికారులు ఒకస్థాయిలో ఉన్న అధికారులను మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. కొన్ని నెలల క్రితం జూనియర్ లైన్‌మెన్‌పై ఆరోపణలు వచ్చాయనే కారణంతో జిల్లా అధికారి సదరు జేఎల్‌ఎంను సస్పెండ్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఇటీవల ఇద్దరు లైన్‌మెన్లను నిజామాబాద్ డివిజన్ డీఈ సస్పెండ్ చేశారు. కానీ.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి డబ్బులు దండుకున్న ఓ ఏఈపై మాత్రం చర్యలు కరువయ్యాయి. సదరు అధికారిపై నేరుగా డివిజన్, జిల్లా, వరంగల్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీలకు నిరుద్యోగులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా విచారణ పేరుతో కాలయాపన చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెరవెనుక పెద్ద ఎత్తున ముడుపుల బాగోతమే కారణమని, ముడుపులు నోళ్లు మూయించాయని సంస్థ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

విచారణ చేయలేకుండానే..

విద్యుత్‌శాఖలో జిల్లాలో అధికారి స్థాయి ఉంటే చాలు ఏం కాదన్న భావన ఉంది. కిందిస్థాయి ఉద్యోగులు చిన్నపాటి తప్పులు చేస్తే విచారణ చేయకుండానే సస్పెండ్ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

- నగర పరిధిలోని నాగారం సెక్షన్‌లో ఓ జూనియర్ లైన్‌మెన్ పనుల విషయంలో డబ్బులు తీసుకున్నాడని ఆరోపణలు రాగా, జిల్లాస్థాయి అధికారి సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించారు. దీనిపై యూనియన్ నాయకులు సీరియస్ కావడంతో మళ్లీ వరంగల్ నుంచి విచారణ చేయించారు.
- విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నందిపేట్ మండలంలోని ఇద్దరు లైన్‌మెన్లను డీఈ ఇదే నెలలో సస్పెండ్ చేశారు.
- జేఏవో డ్యూటీ సమయంలో డివిజన్ కార్యాలయానికి మద్యం సేవించి వచ్చాడని అతడిని డీఈ వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయించాడు. మద్యం తాగి వచ్చాడని నాలుగురోజుల క్రితం సస్పెండ్ చేశారు.

కాలయాపన ఎందుకో..?

నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన అధికారి నగర పరిధిలోని ఓ సెక్షన్‌కు ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన పరిధిలోని సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఒకరిద్దరు ఉద్యోగుల నుంచి ప్రతినెలా ముడుపులు తీసుకుంటారని, కిందిస్థాయి ఉద్యో గులను అకారణంగా బెదిరిస్తారనే ఆరోపణలున్నాయి. ఇంత జరుతున్నా.. ముడుపులు అందించడం కారణంగానే సదరు ఏఈపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్నతప్పులు చేస్తేనే కిందిస్థాయి ఉద్యోగులపై వేటు వేస్తున్న ఉన్నతాధికారులు, లక్షల రూపాయలు వసూలు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తు న్నారు. బాధితులు ఏడీఈ, డీఈ, ఎస్ఈ, సీఎండీ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. చిరుద్యోగులను సస్పెండ్ చేసినప్పుడు స్పందించిన యూనియన్ నాయకులు.. నిరుద్యోగులను ఏఈ మోసం చేసినా.. ఎందుకు స్పందించడం లేదని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

గుడిసె వెలిసె

- బాల్కొండలో ప్రభుత్వభూమిపై కబ్జాదారుల కన్ను
- సర్వే నంబర్ 1333లో లీలలు
- 2009లో జారీ అయినట్లు తెరపైకి పట్టాలు
- గతంలో తహసీల్‌లో పనిచేసిన ఉద్యోగిపై ఆరోపణలు



ప్రభుత్వ భూమిలో వెలిసిన రేకుల గుడిసెలు



2009లో జారీ అయినట్లు చూపుతున్న పట్టా

బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 1333 ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కబ్జాదారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కబ్జాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వేయర్ల బృందం పదిరోజుల క్రితం సర్వేను ప్రారంభించింది. రంగప్రవేశం చేసిన కబ్జాదారులు అనేక ప్రయత్నాలు చేసి అడ్డుకోవడంతో రెండురోజుల పాటు సర్వే నిలిచిపోయింది. మళ్లీ సర్వే ప్రారంభం కావడంతో తమకు ఆ భూమిలో పట్టాలు ఇచ్చారంటూ పలువురు గుడిసెలు వేశారు. ఇన్నాళ్లు లేని గుడిసెలు సర్వే చేస్తున్న సమయంలో ఎందుకు వెలిశాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. 2009లో తమకు పట్టాలు ఇచ్చినట్లు పలువురు పట్టాలు చూపుతుండగా, దానిపై ఉన్నత తహసీల్దార్ సంతకం ఫోర్జరీదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 1333 సర్వే నంబరులో 224.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భాగం ప్రభుత్వ కార్యాలయాలకు, జాతీయ రహదారి 44కు, ఆలయాలు, చర్చీలకు, మసీదులకు కేటాయించారు. మిగతా భూమి మోడల్ పాఠశాల పక్కన సుమారు ముడెకరాల వరకు ఉండగా, దానిపై కబ్జాదారుల కన్నుపడింది. ఇందులో భాగంగా తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి ప్లాట్లు ఏర్పాటు చేశారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అంగట్లో పట్టాలు

సర్వేనంబర్ 1333లోని ప్రభుత్వ భూమికి సంబంధించిన పట్టాలు అంగట్లో దొరికినట్లు దొరుకుతున్నాయి. 2009లో పనిచేసిన తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్లాట్లకు బై నంబరులు వేస్తూ పట్టాలను తయారు చేస్తున్నారని పలువురు అంటున్నారు. ఒక్కో నకిలీ పట్టాను రూ.40వేల నుంచి రూ.45 వేలకు అమ్ముతున్నారు. పట్టాపై కేటాయించిన స్థలానికి సంబంధించిన ఎలాంటి కొలతలు లేవు. ఇదంతా గతంలో బాల్కొండ తహసీల్ కార్యాలయంలో వీఆర్ఏగా పని చేసి, ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉద్యోగి నిర్వాకమని స్థానికులు విమర్శిస్తున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేవంటూ చేతులు దులుపుకుంటున్నారు. పట్టాల బాగోతంపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జాతీయవాద కార్మిక సంఘం బీఎంఎస్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

నిజామాబాద్ సిటీ/నిజామాబాద్ నాగారం: దత్తోపంత్ తేంగ్డి స్థాపించిన భారతీయ మజ్దూర్‌సంఘ్ (బీఎంఎస్) జాతీయవాద కార్మిక సంఘమని భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి పి.లక్ష్మీనారాయణ అన్నారు. భారతీయ తపాలాశాఖ ఉద్యోగులు అసోసియేషన్ గ్రూప్–సీ, పోస్ట్‌మన్, ఎంటీఎస్ నిజామాబాద్ డివిజన్ మహాసభలు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. డిమాండ్లను అంగీకరించాల్సిందే అన్న మొండి ధోరణికి భిన్నంగా 'దేశం కోసం పనిచేస్తాం .. పనికి తగ్గ వేతనం పొందుతాం' అనే నినాదంతో బీఎంఎస్ ముందుకు వచ్చిందన్నారు. దేశభక్త కార్మికులారా ప్రపంచాన్ని ఏకం చేయండి వంటి సార్థక నినాదంతో బీఎంఎస్ పని చేస్తుందన్నారు. భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రూప్ –సీ అధ్యక్షుడిగా మధుసూదన్, కార్యదర్శిగా సాయిరెడ్డి, పోస్ట్‌మన్ యూనియన్ అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా అభిలాష్‌ను ఎన్నుకున్నారు. ఇతర యూనియన్లకు చెందిన వందమంది నూతన సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో పోస్ట్‌మన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి అంజన్‌కుమార్, వెంకట్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సర్టిఫికెట్లు అందజేత



డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయంలో జీవ నియంత్రణ పద్ధతులపై వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో గ్రామీణ యువ రైతులకు జిల్లాలో కేంద్రంలో నిర్వహించిన నైపుణ్య శిక్షణ ఆదివారం ముగిసింది. మొత్తం 15 మంది రైతులు శిక్షణలో పాల్గొని అవగాహన పొందారు. వారికి ఆత్మ పీడీ ఆర్.తిరుమల ప్రసాద్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. శిక్షణ తీసుకున్న రైతులు తమ గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కోర్సు కో–ఆర్డినేటర్ ప్రవీణ్, డీపీడీ డైవ గ్లోరీ, ఏవో శృతి, బీటీఎం భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ టెక్నాలజీ పేరుతో వృథా ఖర్చు

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సిరికొండ: మంచిప్ప రిజర్వాయర్ పనుల్లో గత ప్రభుత్వ పెద్దలు అనాలోచితంగా ఇజ్రాయిల్ టెక్నాలజీ పేరుతో వృథా ఖర్చు చేశారని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. పైపులకే రూ.3వేల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రసిద్ధ లొంక రామలింగేశ్వరస్వామి క్షేత్రాన్ని ఆయన ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయడంపై స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావుతో కలిసి అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. మూడు ఎకరాలకు పైప్ లైన్ విధానంపై అధికారుల వద్ద జవాబు లేదన్నారు. లొంక క్షేత్రానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా, రోడ్డు విస్తరణకు నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, అంతరెడ్డి రాజారెడ్డి, మండలాధ్యక్షుడు బాకారం రవి, నల్ల రాజారెడ్డి, సంజీవ్, మహిపాల్, జేజీఆర్, దిగంబర్, ఆసిఫ్, భాస్కర్‌రెడ్డి, రాంరెడ్డి, నరేశ్, పెద్దన్న, లింబన్న, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల 'ముచ్చట'



పాఠశాల జీవితంలోని మధుస్మృతులను మూటగట్టుకొని ఎవరిదారిన వారు వెళ్లిపోయి మూడు దశాబ్దాలు అయ్యింది. మళ్లీ వారంతా ఒకేచోటికి చేరేందుకు 'అపూర్వ' సమ్మేళనం వేదికైంది. ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు హాజరై (1986–87 బ్యాచ్) ఉల్లాసంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు తెలుసుకోవడంతోపాటు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. – బాల్కొండ

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



పంత్‌కుమార్ మృతదేహం

వర్ని: మండల కేంద్రంలో పాతవర్ని క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈర్నాల పంత్ కుమార్(65) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. నవీపేట్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన పంత్‌కుమార్ చందూర్ వైపు నుంచి వర్ని వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా.. వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. అతివేగం, అజాగ్రత్త కారణంగానే వాహనం అదుపుతప్పిందని, పంత్‌కుమార్ ఘటనాస్థలంలోనే మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లారీ పైనుంచి వెళ్లడంతో..



కుమార్ (ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని దేవితండా వద్ద జాతీయ రహదారి నంబర్ 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గొల్లపల్లికి చెందిన కుమార్(46) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఉంటున్న తన అక్కాబావల దగ్గరికి ద్విచక్రవాహనంపై వెళ్లిన కుమార్ తిరిగి వస్తుండగా, ఎదురుగా వస్తున్న రూప్లానాయక్ తండాకి చెందిన బాదవత్ హన్మాండ్లు ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. కిందపడిన కుమార్‌పై నుంచి వెనకనుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో హన్మాండ్లుకి స్వల్ప గాయాలయ్యాయని, కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్సై మనోజ్ తెలిపారు. మృతుడి బావమరిది పృథ్వీ రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సును తప్పించబోయి..



బాలరాజు (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్ శివారులో బాన్సువాడ–బోధన్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలరాజు (50) అనే వ్యక్తి మృతి చెందాడు. పాతబాన్సువాడ గూడెంగల్లీకి చెందిన ఎర్రబోయిన బాలరాజు ఓ ప్రైవేట్ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సోమేశ్వర్ నుంచి బాన్సువాడ వైపు ద్విచ్రవాహనంపై వస్తుండగా, ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో దేశాయిపేట్ వైపు వెళ్తున్న నాగరాజు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఇరువురికి గాయాలుకాగా బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్రగాయాలైన బాలరాజు మృతి చెందగా, నాగరాజు చికిత్స పొందుతున్నాడు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో యువకుడి మృతి



మాలారాం (ఫైల్)

బాన్సువాడ రూరల్: బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి కామారెడ్డి జిల్లా హన్మాజీపేట్‌కు వచ్చిన హీరాగర్ మాలారాం(19) పాముకాటుకు గురై మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజస్థాన్ రాష్ట్రం పాలి జిల్లా ఉమ్‌కిలి గ్రామానికి చెందిన హీరాగర్ మాలారాం ఐదు సంవత్సరాల క్రితం హన్మాజీపేట్‌కు వచ్చి ఇక్కడ ఆశాపుర స్వీట్‌హోంలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజులాగే తనతో కలిసి పనిచేసే నిబరాం, సంజీవ్‌తో కలిసి శనివారం రాత్రిభోజనం అనంతరం అద్దె ఇంట్లో పడుకున్నారు. ఆదివారం ఉదయం 5గంటల ప్రాంతంలో తలనొప్పి రావడంతో మాలారాంను స్థానిక వైద్యుడికి చూపించగా, పాముకాటుకు గురయ్యాడనే అనుమానంతో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. వారు తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో పాము కనిపించింది. మాలారాం ఎడమచేయి మణికట్టుపై కాట్లు కనిపించాయి. వారువెంటనే బాన్సువాడు తీసుకెళ్లగా మాలారాంను పరీక్షించిన డ్యూటీడాక్టర్.. మృతి చెందినట్లు నిర్ధారించాడు. మృతుడి బంధువు హీరాగర్ మేగారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఒకరు..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని కల్దుర్కిలో బాబయ్య (56) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం మత్తులో వ్యవసాయ భూమిలోని బోరువద్ద స్నానం చేస్తుండగా బాబయ్య ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడని అతడి అక్క ఆశమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



లంబాడి పీర్య (ఫైల్)

రాజంపేట: అనారోగ్య సమస్యలు, అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో మండలంలోని ఆరెపల్లి తండాకు చెందిన పీర్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. పీర్య కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడం, ఆస్పత్రుల ఖర్చులకు అప్పులు కావడంతో నిత్యం మనోవేదనకు గురయ్యేవాడు. శనివారం రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిన పీర్యా రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికుల సహకారంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతుకగా ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తండ్రిపై కొడుకు దాడి

ఎల్లారెడ్డి: మండలంలోని మీసానిపల్లికి చెందిన బండారి సాయిరాంగౌడ్‌పై అతడి కుమారుడు వివేకానందగౌడ్ దాడి చేశాడు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయభూమి సర్వే చేస్తున్న సమయంలో ఆస్తి విషయంలో తండ్రితో వివేకానందగౌడ్ గొడవకు దిగి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి కూలీలకు గాయాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామ శివారులో కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై ఆదివారం ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు కూలీలకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ముంబోజిపేట నుంచి లింగంపేటకు ఇటుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ మెంగారం వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాబురావు, విష్ణుకుమార్ అనే కూలీలకు తీవ్రగాయాలుకాగా, బాధితులను ఎల్లారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బాలుడి అదృశ్యం



బోధన్ టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన షాహీన్(6) శనివారం సాయంత్రం అదృశ్యమైనట్లు సీఐ వీరయ్య ఆదివారం తెలిపారు. షాహీన్ అమ్మమ్మతో కలిసి ఉంటున్నాడు. సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుని రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సెపక్ తక్రాలో జిల్లా జట్ల సత్తా



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా టోర్నీలో జిల్లా బాలబాలికల జట్లు సత్తా చాటాయి. నల్గొండ జిల్లాలో రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించగా, సబ్ జూనియర్ బాలబాలికల టోర్నీలో జిల్లా బాలికల జట్టు బంగారం పతకం సాధించింది. జూనియర్ బాలికల విభాగంలో సిల్వర్, జూనియర్ బాలుర విభాగంలో మూడో స్థానం సాధించారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటడంపై సెపక్ తక్రా రాష్ట్ర అధ్యక్షుడు నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులుతోపాటు జట్టు మేనేజర్, జిల్లా సెక్రెటరీ గాదారి సంజీవరెడ్డిని అభినందించారు.

సాఫ్ట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారిణుల ప్రతిభ

- జాతీయస్థాయిలో రాష్ట్రజట్టుకు ప్రథమ స్థానం



నిజామాబాద్ నాగారం: సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ బీహార్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించిన జాతీయస్థాయి టోర్నీలో రాష్ట్రజట్టు ప్రథమ స్థానంలో నిలువగా, జిల్లా క్రీడాకారిణులు ప్రతిభచాటారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు టోర్నీ కొనసాగింది. జూనియర్ సాఫ్ట్‌బాల్ ఫైనల్స్‌లో రాష్ట్రజట్టు కేరళ జట్టుపై 10 – 9 తేడాతో విజయం సాధించింది. రాష్ట్రజట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహించారు. అజ్మీరా ఇందు (కెప్టెన్), గోక శ్రావిక, గోక సాత్విక, కేతావత్ సోని కీలకపాత్ర పోషించి బంగారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారులను జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దం లింగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతారావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు టి విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్న ప్రతిభా (సీవోఈ) కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశంకోసం ఆదివారం నిర్వహించిన సీవోఈ సెట్ – 2024 రెండో దశ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు సంస్థ ఆర్‌సీవో కే.అలివేలు, డీసీవో బి.సంగీత తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో నిజామాబాద్ జిల్లాలో రెండు, కామారెడ్డి జిల్లాలో ఒకటి, నిర్మల్ జిల్లాలో ఒకటి చొప్పున మొత్తం 4 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. రెండో దశ ప్రవేశ పరీక్షకు 1,542 మంది అర్హత సాధించగా వారిలో 1,483 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షాకేంద్రాలను ఆర్‌సీవో, డీసీవోలు సందర్శించి తనిఖీ చేశారు.